క్లుప్తంగా

ఆలయ పనులకు భూమి పూజ



మహదేవపురంలో భూమి పూజ చేస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి

శిరివెళ్ల: మహదేవపురంలో పురాతన నరసింహ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. దాతల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నారని, ఇందుకు తన వంతుగా సహకరిస్తానని చెప్పారు.మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ నరహరి, సర్పంచు పెద్ది రమణయ్య, నాయకులు జయలక్ష్మమ్మ, అబ్రహం, గ్రామస్తులు పాల్గొన్నారు.


జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయండి



మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

రుద్రవరం: ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డులకు ఆధార్‌ను సంధానం చేయాలని పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన రుద్రవరం,ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని, పనులు చేసిన వెంటనే వర్క్ ఫైల్, నేం బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏపీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ,సీడీసీఎల్ ఆర్‌సీ పరమేశ్వర్లు, ఆయా మండలాల ఏపీఓలు,ఈసీ,టీఏలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గోవింద మాలధారులు

నంద్యాల(వ్యవసాయం): చిన్నచెరువు వద్ద బిల్లలాపురం రస్తాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ గోవింద ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం గోవింద మాలధారులు వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి బోదెలతో నిర్మించిన ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనసేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి మండప పూజ అనంతరం మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని దీపోత్సవంతో గ్రామోత్సవం జరిపించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాతలు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన గంధం రఘునాథరెడ్డి,రాధాకుమారి దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. దాతలకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల జిల్లా, నందికోట్కూర్ మండలం బ్రాహ్మణ కోట్కూర్ గ్రామానికి చెందిన సుంకన్న కుమారుడు చిన్నయ్య రూ. 1,01,150 విరాళం అందజేశారు. అదేవిధంగా కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి కుమారుడు మల్లికార్జున రెడ్డి రూ.80 విలువ చేసే గోద్రేజ్ సేఫ్టీ లాకర్‌ను వితరణ చేశారు.

వేధింపుల కేసు నమోదు

కోవెలకుంట్ల: వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చినా అదనపుకట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. కోవెలకుంట్ల ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న తంబళ్ల శ్రీలలితను కర్నూలు నగరానికి చెందిన ముఖేష్‌తో 2022 ఏప్రిల్‌లో వివాహం జరిగింది. అయితే కొన్నిరోజుల నుంచి అదనపు కట్నం తేవాలని భర్తతోపాటు అత్త రామసుజాత, మామ శంకరయ్య, ఆడపడుచు నిఖిత ఆమెను మానసికంగా శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. పుట్టింటికి చేరుకున్న శ్రీలలిత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సేవల నిలయాలు.. సహకార సంఘాలు

- జిల్లాలో 5 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఇప్పటికే రెండు పెట్రోల్ బంకుల ఏర్పాటు
- ప్రతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్
- 144 బహుళ సౌకర్యాల గోదాముల్లో 139 నిర్మాణాల పూర్తి
- అందుబాటులో 250 రకాల సేవలు

టీడీపీ హయాంలో నిర్వీర్యమైన సహకార రంగాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బలోపేతం చేసింది. సహకార పరపతి కేంద్రాల ద్వారా పలు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా పెట్రోల్ బంక్‌లు, గోదాములు, జనరిక్ మందుల దుకాణాలు, సీఎస్‌సీ సెంటర్లు తదితర వాటిని వాటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించి సేవల నిలయాలుగా మార్చింది.



నంద్యాల మండలం భీమవరం వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు,



పులిమద్ది వద్ద నిర్మించిన గోదాము

నంద్యాల(సెంట్రల్): ఒకప్పుడు పరిమిత సేవలందించే సహకార సంఘాలు నేడు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరింపజేస్తున్నాయి. బహుళ సేవలను సహకార పరపతి కేంద్రాల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చాయి. అందులో భాగంగా జిల్లాలో 5 జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు గుర్తింపు ప్రక్రియ పూర్తి కాగా, రెండు పెట్రోలు బంకులు ఇప్పటికే తమ కార్యాకలాపాలు కొనసాగిస్తున్నాయి. గోదాములు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పాన్‌కార్డు, అలాగే 1బీ, అడంగల్ సర్టిఫికెట్లు ఇలా వివిధ రకాల సేవలు అందిస్తూ సేవలను విస్తృతం చేశాయి.

జనరిక్ ఔషధ కేంద్రాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనరిక్ ఔషధ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిది. అందులో భాగంగా తొలివిడతగా జిల్లాలో 5 సహకార పరపతి సంఘాలను (పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. త్వరలో వీటిని అందుబాటులోకి తీసుకురానుంది.

అందుబాటులోకి 250 రకాల సేవలు..

సహకార పరపతి సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో రైతులు, ప్రజలకు ఏదైనా సర్టిఫికెట్, 1బీ, అడంగల్, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పాన్‌కార్డు వంటి సేవలకు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో మీ సేవ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేసి దోపిడీకీ పాల్పడేవారు. వీటికి చెక్ పెట్టేలా ప్రతి సహకార పరపతి సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి 250 రకాల సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 56 సహకార పరపతి సంఘాలుండగా, వీటిలో 54 సంఘాలు కామన్ సర్వీస్ సెంటర్ల(సీఎస్‌సీ) ఏర్పాటుకు దరఖాస్తు చేశాయి. ఇందులో 51 సంఘాలు ఇప్పటికే సీఎస్‌సీ సేవలను అందుబాటులోకి తెచ్చాయి. ఇక జిల్లా వ్యాప్తంగా 144 బహుళ సౌకర్యాల గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా, ఇప్పటికే 91 గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. 30 గోదాములను రైతులకు అందుబాటులో ఉంచారు.

పెట్రోల్ బంకుల నిర్వహణ..

ఆర్థికంగా బలోపేతం చేయడానికి జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.నంద్యాల మండలం పోలూరు సహకార పరపతి సంఘం పరిధిలోని భీమవరంతో పాటు, దొర్నిపాడు మండలం గుండుపాపలలో పెట్రోలు బంకులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక వాణిజ్య బ్యాంకులకు దీటుగా బంగారు రుణాల రంగంలోనూ సహకార సంఘాలు రాణిస్తున్నాయి. జిల్లాలోని పోలూరు, భానుముక్కల, ఎర్రగుంట్ల, పాములపాడు, బ్రాహ్మణకొట్కూరు పీఏసీఎస్‌లలో ఇప్పటికే బంగారు రుణాలు అందజేస్తున్నాయి.

సహకార రంగ పురోభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం



సహకార రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పంట ఉత్పత్తులపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాం.జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటుకు గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే వీటిని ఏర్పాటు చేస్తాం.

– శివలీల, జోనల్ మేనేజర్, డీసీసీబీ

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో వాణిజ్య శాస్త్రం విభాగంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 31మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ శశికళ, క్లబ్ కన్వీనర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజారాణి తెలిపారు. వారు మాట్లాడుతూ 18న జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు 19న బహుమతులు అందజేస్తామని చెప్పారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా రబీలో సాగైన పలు పంటల్లో మేలైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు రైతన్నలకు సూచించారు. ముఖ్యంగా కంది, వరి, మొక్కజొన్న, శనగ, వేరుశనగ పంటలకు సంబంధించి తెగుళ్ల నివారణకు పలు పరిష్కారాలను వివరించారు. వాతావరణంలో అధిక తేమ వల్ల ఈ పంటలకు పలు శిలీంద్ర తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

29 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): భూ హక్కు చట్టాలకు వ్యతిరేకంగా నంద్యాల జిల్లా న్యాయవాదులు ఈనెల 29వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోళ్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి శనివారం తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందని, భూ హక్కు చట్టాలపై సివిల్ కోర్టుకు ఎటువంటి పరిధి ఉండదన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



విక్టర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విడిది చేసిన ఆయనను జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్యదర్శి కారు రవి కుమార్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, మనోజ్ కుమార్, సేవాదల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ శాలువ, పూలమాలలతో సత్కరించారు.

రైతుల్లో వణుకు



అప్పనపల్లె వద్ద ధాన్యం కుప్పలపై కప్పిన పట్టలు

రుద్రవరం: మండలంలోని రైతుల్లో వణుకు మొదలైంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్క జొన్న,మినుము వంటి పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. ధాన్యం చేతికందగానే రైతులు విక్రయాలు సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే వాతావరణ శాఖ తుపాన్ హెచ్చరికలు చేయడం, ఆకాశమం మేఘావృతం కావడంతో పాటు ఈదురు గాలులు వీస్తున్నాయి. వర్షం కురిస్తే రోడ్లు,కళ్లాలు,బయలు ప్రదేశాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి రంగుమారుతాయనే భయం వారిలో నెలకొంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉండటంతో రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసి పట్టలు కప్పారు. ఇంకొందరు ఇళ్లు, గిడ్డంగులకు తరలించారు. కాగా.. వర్షం కురిస్తే రబీ కింద సాగు చేసిన పంటలకు నీటి తడులకు ఇబ్బందులు తొలగుతాయని మరికొందరు అన్నదాతలు పేర్కొంటున్నారు.

గాడిద పాలండోయ్..



గాడిదను పట్టుకెళ్తున్న మహిళ

దొర్నిపాడు: పల్లెల్లో గాడిద పాలను విక్రయిస్తూ కొందరు జీవనం సాగిస్తున్నారు. తెలంగాణకు చెందిన రమాబాయి అనే అనే మహిళ శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఓ గాడిదను పట్టుకొని వీధి వీధి తిరిగి పాలు విక్రయించింది. ఈ పాలు తాగితే చిన్నపిల్లల్లో అలర్జీని దూరం చేసి రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెబుతోంది. 10 ఎం.ఎల్ రూ.150 ప్రకారం విక్రయిస్తుంది. ఈ లెక్కన లీటర్ ధర రూ.15వేలు అవుతుంది. వీటికి ఇంత డిమాండ్ ఉందా అంటూ స్థానికులు అవాక్కయ్యారు. కాగా పలువురు తల్లులు తమ పిల్లలకు ఆ మొత్తం చెల్లించి ఉగ్గుతో గాడిద పాలు తాపించారు.

దిగుబడులు ఆశాజనకం



గోవిందపల్లెలో వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

శిరివెళ్ల: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన వరి పంటలో ఆశాజనకంగా దిగుబడులు వచ్చాయని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శనివారం గోవిందపల్లెలో వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన జీ. పెద్ద నరసింహారెడ్డికి చెందిన పొలంలో కోత ప్రయోగం చేయగా ఎకరాకు 48 బస్తాలు, చిన్న నరసింహారెడ్డి పొలంలో ప్రయోగం చేయగా 46 బస్తాల దిగుబడులు వచ్చాయన్నారు. ఏఓ సుధాకర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య విభాగాన్ని మరింత బలోపేతం చేస్తాం

వెలుగోడు: కర్నూలు ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ బళ్లాని వెంకట సత్యనారాయణ అన్నారు. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బళ్లాని వెంకట సత్యనారాయణను ఇటీవల వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం కర్నూలు, నంద్యాల జిల్లాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు. శనివారం నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా విజయదుందుభి మోగించనుందని ధీమ వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, పచ్చపత్రికలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి వాణిజ్య విభాగం జోన్‌–7 ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పార్టీ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

బిస్కెట్ల దుకాణం దగ్ధం

డోన్‌టౌన్: పట్టణంలోని పాతపేటకు వెళ్లే రహదారిలోని రైల్వే గేట్ల వద్ద ఉన్న బిస్కట్ల అంగడిలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైంది. రూ. 4 లక్షల బిస్కట్లు, సిగరెట్లు, తినుబండరాళ్ల అగ్నికి ఆహుతి అయినట్లు బాధితుడు షేక్ మస్తాన్ వలి శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకొని తాళం వేసి ఇంటికి వెళ్లానన్నారు. అర్ధరాత్రి అంగట్లో నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా మంటలు చెలరేగాయన్నారు.

ఎమ్మెల్సీ మృతికి సంతాపం

ఉయ్యాలవాడ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సంతాపం తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆయన మృతికి శనివారం రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. భీమవరంలో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షకు ఎమ్మెల్సీ మద్దతు తెలిపి ఇంటికి తిరిగి వెళ్తున్న తరుణంలో మృతి చెందడం బాధాకరమన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో అంగన్‌వాడీలు శనివారం వినూత్న నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్ల పై నిలబడి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం కార్యదర్శి నిర్మలమ్మ, సునీతలు కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, లక్ష్మణ్, గౌస్, వెంకట లింగం పాల్గొన్నారు.

గోస్పాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది రిలే దీక్షలు కొనసాగించారు. సంఘం నాయకురాలు నిర్మలమ్మ, రమణమ్మ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, సువర్ణ, హుసేనమ్మ, సారమ్మ, ఆదిలక్ష్మి, భూలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి

నంద్యాల(సిటీ): ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫాస్ట్ ట్రాక్ ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సెంటర్ నిర్వహకులు ప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని ఆయుష్ యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పట్టణంలో ప్రజలకు అందించే తినుబండారాలను నాణ్యతగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, హైజెనిక్ ఆహారం అందించి ప్రజల ఆరోగ్యాని కాపాడాలన్నారు. శిక్షణ తీసుకున్న హోటల్, తినుబండారాల నిర్వాహకులకు సర్టిఫికెట్లు అందించారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ సాయి, వంశీ, లలిత, సుజాత పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై దాడులు హేయం

నంద్యాల(అర్బన్)/బొమ్మలసత్రం: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమ్మె నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటే వారిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్యని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి,వర్కింగ్ ప్రెసిడెంట్ చైత్ర శ్రీజారెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె కారణంగా బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బందికి పనులు అప్పజెప్పిందన్నారు. సచివాల ఉద్యోగులు ప్రజలకు మంచి చేస్తుండగా కొన్ని చోట్ల దాడులకు పాల్పడుతూ, దురుసుగా ప్రవర్తించటం అంగన్‌వాడీ వర్కర్స్‌కు సరైందికాదని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దొర్నిపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కొండాపురం, అమ్మిరెడ్డినగరం గ్రామాల్లో సర్పంచులు మాధవీలత, లక్కు మాధవీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పీఎం కిసాన్, ఉజ్వల, ఆయూష్మాన్ భారత్, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, నాయకులు లక్కు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

19న ఫిమేల్ థెరపిస్ట్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ

నంద్యాల టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయుర్వేద వైద్యశాలలో ఫిమేల్ థెరపిస్ట్ పోస్టుకు ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోద తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండి పంచకర్మ సర్టిఫికెట్ కోర్సు చేసిన మహిళా అభ్యర్థులు ధ్రువ పత్రాలతో మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయుష్ విభాగంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

దేశానికే ఆదర్శం నవరత్నాలు



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : రాష్ట్రంలో అమలవుతున్న నవరత్నాలు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు మన పథకాలను అనుసరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాచేపల్లి సచివాలయ పరిధిలోని బాచేపల్లె, కొండంపల్లి, బాచేపల్లి తండాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, అమ్మ ఒడి, రైతుభరోసా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్య శ్రీ, ఇంటి నిర్మాణాలు, సున్నావడ్డీ రుణాలు, ఇళ్ల మంజూరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతుంటే ప్రతిపక్షాలకు ఇవేమీ కనిపించటం లేదని, మనుగడ కోల్పోకూడదని దిక్కుమాలిన ఆరోపణలు చేస్తూ ప్రజల్లో చులకనవుతున్నారన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొట్టి నాగేశ్వర్‌రావు, డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ ట్రయల్ పోటీలు ప్రారంభం



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ట్రయల్ పోటీలు శనివారం సరస్వతి నగర్ వార్డు సచివాలయంలో నిర్వహించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాలీబాల్, క్రికెట్, కబడ్డి, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల ట్రయల్స్ నిర్వహించామరన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ద్రాక్షావలి ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి బాలన్న, మండల అధ్యక్షుడు నాగజ్యోతిశ్వరరెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అనసూయకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మూడు సంవత్సరాలు పూర్తయిన వారికి ఈటీఈ అమలు చేసి ప్రమోషన్లు కల్పించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధి సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీఓ నాగజ్యోతి, ఈసీ ఉమామహేశ్వర్, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): ఆళ్లగడ్డ బీసీ హాస్టల్ వార్డన్ సురేష్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి బాలాజీ, పీవైఎల్ డివిజన్ కన్వీనర్ ఆనంద్ కోరారు. శనివారం పట్టణంలోని పద్మావతినగర్ సర్కిల్‌లో శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో వార్డన్ విఫలమయ్యారన్నారు. విద్యార్థులకు కోడి గుడ్లు, అరటిపండ్లు ఇవ్వడం లేదన్నారు. జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు వినయ్, నవీన్, కిరణ్, బాషా, హరి నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో ఈ నెల 17 నుంచి ధనుర్మాస పూజలు అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ శనివారం తెలిపారు. నెల రోజులు (జనవరి 16 తేదీ వరకు) జరిగే ఈ పూజల్లో గోదాదేవి అమ్మవారికి రోజుకో అలంకరణ, ప్రత్యేక పూజలు, వేదబంద పారాయణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జనవరి 14వ తేదీన గోదాదేవి కల్యాణం ఉంటుందని చెప్పారు.

ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయాల్లో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని అర్చకులు అనంతయ్య, కమలేష్‌శర్మ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ధనుర్మాసం విష్ణువుకు అత్యంత ప్రీతికరమైందన్నారు. 12 ఏళ్ల పాటు నిష్టతో చేసే కార్యక్రమాలతో వచ్చే పుణ్యఫలం ఈ మాసంలో లభిస్తుందన్నారు.